ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి 8
పెద్దూర్ రైతుల కోసం భూముల సర్వే 8



గంగమ్మ దేవాలయం వద్ద కల్యాణం

మామిడిపల్లి జాతరలో భక్తులు

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం



ఆలయ ఆవరణలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్



గంగమ్మను దర్శించుకుంటున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రజాప్రతినిధులు



మల్లారెడ్డిపేట అంజన్నను దర్శించుకుంటున్న నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

- వైభవంగా మాఘ అమావాస్య జాతరలు
- సిరిసిల్ల మానేరు తీరం, మామిడిపల్లి, మల్లారెడ్డిపేట ఆలయాల్లో సందడి
- భారీగా తరలివచ్చిన భక్తులు



మడలేశ్వర స్వామి కల్యాణం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మాఘ అమావాస్య జాతరలతో సిరిసిల్ల మానేరు, మూలవాగుల తీరం భక్తులతో సందడిగా మారింది. అనాదిగా వస్తున్న సంప్రదాయాలకు అద్దం పడుతూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జాతరలకు భక్తులు పోటెత్తారు. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే శివరాత్రి వరకు జాతరలు సాగుతాయి. జాతరలకు జనం తరలివెళ్లి భక్తి శ్రద్ధలతో ఆయా దేవాలయాల్లో పూజలు చేస్తారు. జాతరల్లో బొమ్మల దుకాణాలతో సందడి నెలకొంది. హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కామారెడ్డి, సిద్ధిపేట, నాందేడ్, ప్రాంతాల నుంచి బొమ్మల విక్రయదారులు, జిల్లాకు తరలివచ్చి దుకాణాలు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల మానేరు తీరంలో బొమ్మల దుకాణాలు జాతరకు ప్రత్యేక శోభను తెచ్చాయి. జిల్లాలోని మా నేరు, మూల వాగు తీరాల్లో దేవతా మూర్తుల కల్యాణాలు, ప్రత్యేక కార్యక్రమాలతో సాగిన జాతరలకు భక్తులు తన్మయత్వంతో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మూడు జాతరలు ముచ్చటగా సాగాయి. సిరిసిల్ల మానేరు వాగులో గంగభవానీ జాతర, మడలేశ్వర స్వామి జాతర, మిడ్ మానేరు కరకట్ట వద్ద రామప్ప రామలింగేశ్వరస్వామి జాతరలకు భక్తులు తరలివచ్చారు. మూడు దేవాలయాల్లో స్వామివారల కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. మానేరు తీరంలో గంగమ్మ దేవస్థానం వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. రజక సంఘం ఆధ్వర్యంలో మడలేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం, నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కరకట్ట వద్ద రామప్ప రామలింగేశ్వర స్వామి కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల జాతరలు, కల్యాణోత్సవంలో ప్రణాళికా సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్. బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, మంచె శ్రీనివాస్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు స్వామివారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, వైద్య శివప్రసాద్, మాజీ చైర్‌పర్సన్ సామల పావని, మ్యాన ప్రసాద్ స్వామివారలను దర్శించుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, అధికారులు కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు.

● మల్లారెడ్డిపేటలో అంజన్న జాతర

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో శుక్రవారం ఆంజనేయస్వామి జాతరకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఏటా మాఘ అమావాస్య రోజున అంజన్న జాతర కొనసాగుతుంది. ఎత్తైన గుట్టల్లో వెలిసిన స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. మల్లారెడ్డిపేట అంజన్న ఆలయ సమీపాన ఉన్న గుండలో స్నానమాచరించి దర్శించుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని నమ్మకం. ఏటా మాఘ అమవ్యాస సందర్భంగా మల్లారెడ్డిపేట అంజన్న సన్నిధికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈసారి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, కాంగ్రెస్ జిల్లా నాయకులు చక్రధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, ఆలయ కమిటీ చైర్మన్ మణిదీప్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్, మాజీ సర్పంచ్ శెట్టి మహేశ్వరీ, నాయకులు ఉన్నారు.

● మామిడిపల్లిలో..

కోనరావుపేట: కోనరావుపేట మండలం మామిడిపల్లి సీతారామచంద్ర స్వామిని మాఘ అమావాస్య జాతర సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఐదు గంటలకే స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శ్రీరాములు, గోలి శ్రీనివాస్ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి రామరాజ్యాన్ని తలపించే విధంగా ప్రజారాజ్య పాలన చేస్తుందన్నారు. రాష్ట్రంలో సంపదను పెంచి ప్రజల సంక్షేమానికి ఖర్చు పెడతామన్నారు. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆ బలాన్ని స్వామివారు ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, ఫిరోజ్ పాషా, నందు గౌడ్, కేతిరెడ్డి అరుణ, భారతి, నర్సయ్య, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట మండలం మామిడిపల్లి సీతారాముల ఆలయంతోపాటు నాగారం కోదండ రామస్వామి ఆలయం మాఘ అమావాస్య జాతర సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డితో పాటు మాజీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, పలువురు నేతలు స్వామివారిని దర్శించుకున్నారు. మామిడిపల్లి సీతారాముల ఆలయం, నాగారం కోదండ రామస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. మామిడిపల్లి సీతారాముల స్వామిని దర్శించుకోవడానికి సుమారు 30 వేల మంది భక్తులు వచ్చారు. స్వామివారిని చెలిమెడ ఆసుపత్రి చైర్మన్ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్ రెడ్డి, అల్లాడి రమేష్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, నాయకులు మల్యాల దేవయ్య, వంగపల్లి సుమలత, నాగారంలో చెన్నమనేని శ్రీకుమార్ దర్శించుకున్నారు.

లింగన్నపేట ప్రభుత్వాస్పత్రికి ఎన్‌క్వాస్ గుర్తింపు



లింగన్నపేట పీహెచ్‌సీ

గంభీరావుపేట, ఫిబ్రవరి 9 : గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. మెరుగైన వైద్యం అందించడంతోపాటు నిర్వహణలో పనితీరు కనబరుస్తున్న లింగన్నపేట పీఎచ్‌సీకి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ సర్టిఫికెట్)ను ప్రకటించింది. గత సంవత్సవం డిసెంబరులో కేంద్ర బృందం లింగన్నపేట పీఎచ్‌సీని సందర్శించింది. ఆస్పత్రిలో ఫార్మసీ, ఓపీడీ, ఓటీ, ల్యాబ్, నేషనల్ ప్రోగ్రాం, ఐసీడీ వార్డులలో అందిస్తున్న సేవలను గుర్తించింది. లింగన్నపేట ప్రభుత్వాస్పత్రి వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమేష్, జిల్లా ప్రోగ్రాం అధికారి రమ, క్వాలిటీ కంట్రోల్ అధికారి విద్యాసాగర్, హెల్త్ సూపర్‌వైజర్ ఎల్‌హెచ్, సీఎఎస్‌ఎం, ఆశా కార్యకర్తలను అభినందించారు. వైద్యుడు వేణుగోపాల్, హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ప్రోత్సాహంతో ఎన్‌క్వాస్ గుర్తింపు పొందామన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 9:తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్) ఆధ్వర్యంలో లైట్ మోటార్ వెహికల్(ఎల్‌ఎంవీ), హెవీ మోటార్ వెహికల్ (హెచ్‌ఎంవీ)లో గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, ఎంప్లాయిమెంట్ జన రేషన్, మార్కెటింగ్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో 3 నెలల ఉచిత శిక్షణను తంగళ్లపల్లి మండలం మండేపల్లి టైడ్స్‌లో ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే యువతకు టైడ్స్‌లోనే ఉచిత వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెంది, 10వ తరగతి పాస్ లేదా ఫెయిలైనా పర్వాలేదని వివరించారు. అభ్యర్థి ఎత్తు 160 సెంటీమీటర్ల పైన ఉండి, దేశంలో ఎక్కడైనా ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మూడు నెలలపాటు అప్రెంటిస్ ఉంటుందని పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌ఎం లైసెన్స్ ఏడాది పూర్తయిన వారికి హెచ్‌ఎంవీ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 10వతరగతి సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డ్, కులం, ఆదాయం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ ప్రతులు, 6 ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 8985431720 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కేటీఆర్ సహకారంతో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో మున్సిపల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ స్ఫూర్తితోనే చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. నాడు తెలంగాణలో రజాకర్లకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటాలు చేసిందన్నారు. తెలంగాణ కోసం ముందుండి పోరాటాలు చేసిన ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేసుకొని గౌరవించాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో జిల్లా కేంద్రంలో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నట్లు చెప్పారు. ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, డీఈ ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు వెల్దండి దేవదాస్, అన్నారం శ్రీనివాస్, దార్నం అరుణలక్ష్మీనారాయణ, లింగంపల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, బీఆర్ఎస్ నాయకులు దార్ల సందీప్, అడగట్ల మురళి, కల్లూరి మధు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, రజక సంఘం పట్టణం అధ్యక్షుడు దండు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాసర్ల మహేందర్, ఉపాధ్యక్షులు మారుపాక పెద్ద శ్రీనివాస్, కాసర్ల శ్రీనివాస్, కాసర్ల వెంకటేష్, పోతరాజు గౌరయ్య, కోశాధికారి బండి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి కాసర్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారు దండు ఎల్లయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్

● చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణకు నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాత్రమే హాజరవడం చర్చనీయాంశంగా మారింది. సిరిసిల్ల మున్సిపల్ పాలక వర్గంలో 39 మంది కౌన్సిలర్లకు దాదాపు 33 మంది ఆ పార్టీ కౌన్సిలర్లు ఉన్నారు. కేవలం నలుగురే పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, కలెక్టరేట్, ఫిబ్రవరి 9: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్‌కు చెందిన అద్దె గదులు, స్టేడియం, కొత్త చెరువు బండ్ అండ్ పార్కుపై కలెక్టరేట్‌లో శుక్రవారం మున్సిపల్, స్పోర్ట్స్, విద్యాశాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ నిధులతో నిర్మించిన అద్దె గదులు ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భారీగా ఇంటి పన్ను, నల్ల బిల్లులు బకాయి ఉన్న వారితో సమావేశం ఏర్పాటు చేయాలని, వాటిని తప్పనిసరిగా వసూలు చేయాలని అన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు నిబంధనల మేరకు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మినీ స్టేడియాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం సిరిసిల్లలోని కొత్త చెరువు బండ్ అండ్ పార్క్ నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. దాని నిర్వహణ ప్రైవేటు వారికి అప్పగించేందుకు టెండర్లు ఆహ్వానించామని అధికారులు తెలుపగా, పార్క్ నిర్వహణలో అనుభవం ఉన్నవారిని ఎంపిక చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఈవో రమేశ్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, టౌన్‌అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారి, డీవైఎస్‌వో రాందాస్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ప్రచారం నిజం కాదు : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 9: చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్నారన్న ఫొటోలు, వీడియోలతో సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం నిజం కాదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని, వేరే ప్రాంతాల్లో జరిగిన సంఘటనలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేయవద్దని తెలిపారు. అత్యవసర సమయంలో పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కు కాల్ చేసి సమచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు సర్కారు కృషి చేస్తోందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాఠశాలకు వచ్చినప్పుడు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరగా బోరు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, పంచాయతీ కార్యదర్శి వరుణ్, ఉపాధ్యాయులు తూముకుంట మోహన్‌రెడ్డి, సార మల్లేశం పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 9:మాదక ద్రవ్యాల నిర్మూలన యాంటి డ్రగ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 15న కళాశాలలు, పాఠశాలల్లో జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై యువతలో అవగాహన పెంపొందించడానికి పోటీలు దోహదపడుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులను రెండు కేటగిరీలుగా విభజించామన్నారు. ఇందులో ఆరు నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ కేటగిరీలుగా విభజించామన్నారు.

మధ్యాహ్నభోజన నిర్వాహకుల సమ్మె నోటీసు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9:మధ్యాహ్నభోజన నిర్వాహకులు ఎంఈవోకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 16న కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్, సంఘం సభ్యులు బాలమణి, రాజవ్వ, సంతోష, దివ్య, నర్సవ్వ, లక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9: తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కార్మికుల సమ్మె కరపత్రాన్ని మండలకేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా నాయకుడు సావనపెల్లి ప్రభాకర్, నాయకులు సురేష్, రాజు, శేఖర్, శ్రీనివాస్, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరస్తు.. శుభమస్తు



- రేపటి నుంచి మాఘమాసం మంచిరోజులు
- మోగనున్న పెళ్లి భాజాలు
- ఏప్రిల్ 26 వరకు లగ్నాలే
- 14న ఒక్కటి కానున్న వేలాది జంటలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మాఘమాసం మంచిరోజులు వచ్చేశాయి. పెళ్లి ముహూర్తాలకు మాఘమాసం పెట్టింది పేరు. ఆదివారం నుంచి మాఘమాసం ప్రారంభం కానుండడంతో జిల్లాలో భాజాభజంత్రీలు మోగనున్నాయి. ఫంక్షన్‌హాళ్లు, పెళ్లిపందిళ్లు, డెకొరేషన్‌లు, భాజాలు, వంటవాళ్లు దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. మూడు నెలలు ముహూర్తాలు ఉన్నా ఈ నెల 14న భారీగా పెళ్లిళ్లు జరగనున్నాయి. 14న వసంత పంచమి దివ్య ముహూర్తంతోపాటు కొత్త జంటలకు ప్రేమికుల రోజు కూడా కలిసి వస్తుందని భావిస్తున్నారు.

మూడు నెలలు ముహూర్తాలు

మాఘమాసం, ఫాల్గుణం, చైత్రం అంటే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలో దాదాపు 30 వరకు దివ్య ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెల 11 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు. తరువాత ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభమవుతుంది. ఈ నెల 13, 14, 15, 17, 18, 24, 28, 29 తేదీల్లో పెళ్లిళ్లు ఉండగా మార్చిలో 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ లో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26, 28 తేదీల్లో పెళ్లిళ్లు జరుపుకోవడానికి కొత్త జంటలు సిద్ధమయ్యాయి. వైశాకం, జ్యేష్ఠ మాసాల్లో వివాహ ముహూర్తాలు లేవని, తరువాత ఆషాఢం, శూన్యమాసం వస్తుంది. ఈ ముహూర్తాలు దాటితే మళ్లీ ఆరు నెలల వరకు ముహూర్తాలు లేవు. దసరా తరువాత అక్టోబరు 12 తరువాత ముహూర్తాలు మొదలవుతాయి.

ఫిబ్రవరి 29 ప్రత్యేకం

ఈ సారి లీపు సంవత్సరం వచ్చింది. నాలుగు సంవత్సరాలకు ఒకసారి అరుదుగా ఉండే లీపులో ఫిబ్రవరి 29వ తేదీ ఉంటుంది. పెళ్లిరోజైనా, పుట్టినరోజైనా నాలుగు సంవత్సరాలకు ఒకసారి సెలబ్రేషన్ జరుపుకుంటారు. ఇది కూడా ఒక ప్రత్యేకతగా భావించిన కొన్ని జంటలు ఫిబ్రవరి 29 ముహూర్తం పెట్టుకున్నట్లు పురోహితులు చెబుతున్నారు.

జిల్లాలో కోలాహలం

ఈ నెల 14న జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్లు ఉండడంతో ఫంక్షన్‌హాల్‌లు, క్యాటరింగ్, పందిళ్లు, డెకోరేషన్‌లు, వీడియోగ్రాఫర్లు, పెళ్లి చప్పుళ్లు, పురోహితులు, డీజే, ఆర్కెస్ట్రా వాళ్ల దొరకడమే కష్టంగా మారింది. ఇప్పటికే పెళ్లికి కావాల్సిన పట్టు చీరలు, బట్టలు, బంగారు ఆభరణాల కొనుగోళ్లతో సందడిగా మారింది.

ప్రీ వెడ్డింగ్ సందడి

పెళ్లిళ్ల కంటే ముందే వివాహ తంతు అంతా జరిగిపోతోంది. పెళ్లి తరువాత జ్ఞాపకంగా మిగిలే వెడ్డింగ్ ఫొటోగ్రఫీ కంటే ముందే ప్రీవెడ్డింగ్ ఫొటోగ్రఫీపై ఆసక్తి పెరిగింది. పల్లెల నుంచి పట్టణాల వరకు ప్రీ వెడ్డింగ్ షూట్‌లపై ఆసక్తి చూపుతున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్ల కోసం దేశాలే దాటి పోతున్నారు. సాధారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రీ వెడ్డింగ్ షూట్‌కు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. దీంతోపాటు ఆల్బమ్, వీడియోలు కలిపి రూ.10 లక్షల

అదనపు కట్నం కోసం వేధించిన వారిపై కేసు

కొడిమ్యాల, ఫిబ్రవరి 9: అదనపు కట్నం కావాలంటూ నిత్యం వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కొడిమ్యాల హెడ్‌కానిస్టేబుల్ అర్జరాజు శనివారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నమిలికొండ గామానికి చెందిన లావణ్యకు సిరిసిల్ల పట్టణానికి చెందిన పల్లెపు కుమార్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నంగా ఐదు తులాల బంగారు నగలు, ద్విచక్ర వాహనం అందించారు.

వీరికి ఒక కూతురు జన్మించింది. రెండు సంవత్సరాల నుంచి లావణ్యను రెండు లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకరావాలని భర్త పల్లెపు కుమార్, అత్తమామ, ముగ్గురు ఆడపడుచులు, మానసికంగా వేధిస్తున్నారంటూ లావణ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: మంకమ్మతోటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళను అరెస్టు చేశామని రెండో టౌన్ సీఐ వెంకటేష్ తెలిపారు. విటుడు రాజు, యువతులను తీసుకువస్తున్న వ్యక్తి ప్రశాం త్, ఇంటి యజమాని రూప్‌సింగ్‌లపై కేసు నమోదు చేవామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9 : సప్తగిరి కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను శుక్రవారం అరెస్టు చేశామని రెండో టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 36,070 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కాలువలోపడి యువకుడి గల్లంతు

చొప్పదండి, ఫిబ్రవరి 9: చొప్పదండి పట్టణ శివారులోని డి-86 కాలువలో పడి యువకుడు గల్లంతు అయినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. షేక్ యూసుఫ్(25) బంధువుతో కలిసి శుక్రవారం సాయంత్రం చిల్లవాడ సమీపంలో డి-86 కాలువ మెట్ల వద్ద స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో నాటిలో గల్లంతు అయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి బి. ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయబద్ధమైన విధులను విస్మరించి, అసభ్యంగా ప్రవర్తించడం, అసభ్య పదజాలం ఉపయోగించడం, ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించినందుకు గాను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంథని నుంచే పీవీ రాజకీయ ప్రస్థానం

- 1957 నుంచి నాలుగుసార్లు మంథని ఎమ్మెల్యేగా వరుస విజయాలు - ఉమ్మడి ఏపీలో వివిధ శాఖల మంత్రిగా, సీఎంగా సేవలు- పీవీకి భారతరత్న ప్రకటించిన కేంద్రప్రభుత్వం



మంథని, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు మంథని నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం దేశంలో అత్యున్నమైన భారతరత్న అవార్డును ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం మంథని ప్రాంత వాసులు, రాజకీయ పార్టీల నేతలు మంథని తో పీవీకి ఉన్న అనుబంధాన్ని మరో మారు నెమరువేసుకున్నారు. 20 ఏళ్లపాటు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష పార్టీల నేతలు, అధికారులతో కలిసిమెలిసి మంథనిలో పీవీ నర్సింహారావు రాజకీయ కార్యకలాపాలు కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు 1957లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీవీ నర్సింహారావు పోటీచేసి ఘనవిజయ సాధిం చి తన రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనతరం జరిగిన 1962, 1967, 1972 శాసనసభ ఎన్నికల్లో మంథని నుంచి వరుసగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీవీ గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖల మంత్రిగా, కొద్దినెలల పాటు సీఎంగా సేవలందించారు. అనంతరం ఎంపీగా పోటీచేసి దేశ రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. పలుమార్లు ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా, ప్రధానమంత్రిగా పనిచేసి ప్రజాపాల నలో తన రాజకీయ చతురతను చాటుకున్నారు. మంథని పట్టణానికి విద్యుత్ కల్పన, గోదావరినది నుంచి తాగునీరు అందించడానికి పైప్‌లైన్, నల్లా కనెక్షన్లు, బొక్కలవాగుపై వంతెన నిర్మాణం, అడవిసోమన్‌పల్లి వద్ద మానేరు నది భారీ వంతెన నిర్మాణం తోపాటు అనేక రోడ్లు, విద్యా, వైద్య సేవలను విస్తరించడానికి పీవీ ఎనలేని కృషి చేశారు.

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మంథని పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో పీవీ నర్సింహారావు విగ్రహాన్ని ఏర్పాటు ప్రతిష్ఠించి ఘనంగా ఆవిష్కరించారు. పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జడ్పీ చైర్మన్ పుట్ట మధు, కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం వేర్వేరుగా హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పీవీ విగ్రహానికి బెజ్జంకి డిగంబర్, మేడగోని రాజమౌళిగౌడ్, రామడుగు మారుతి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నాటి 'రాజన్న' ధర్మకర్తకు భారతరత్న

వేములవాడ: ఒకప్పుడు వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తగా సేవలందించిన దివంగత మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యున్నతమైన భారతరత్న పురస్కారం ప్రకటించడంపై వేములవాడ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తగా ఈ ప్రాంతంతో అనుబంధం కలిగి ఉన్నాడు. 1956లో అప్పటి రాజన్న ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు రేగులపాటి అనంత రావుతో పాటు రాజన్న ఆలయ ట్రస్ట్ సభ్యులుగా పీవీ నరసింహారావు కొనసాగారు. 1990లలో వేములవాడ రాజన్న దర్శనానికి కూడా వచ్చారు. అప్పటి ఎంపీ చొక్కారావు ఈ సందర్భంగా పీవీ నరసింహారావును రాజన్న ఆలయంలో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. పీవీ నరసింహారావు కు భారతరత్న పురస్కారం ప్రకటించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, విశ్వహిందూ పరిషత్ నాయకుడు డాక్టర్ మధు రాధాకిషన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జయహో పీవీ.. భారతదేశపు లీవి

కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త పాములపర్తి వేంకట నరసింహారావును దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించగా కొందరు సాహితీవేత్తలు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



పీవీ నరసింహారావును సత్కరిస్తున్న నాటి ఎంపీ చొక్కారావు(ఫైల్)

● సముచిత గౌరవం దక్కింది

- డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, సాహితీవేత్త, అవధాని



పీవీకి సముచిత గౌరవం దక్కింది. యావత్ దక్షిణ భారతదేశంతో పాటు తెలుగువారందరూ గర్వించదగ్గ విషయం. ఆర్థికంగా దిగజారుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను తన మేధాశక్తితో పునరుద్ధరించిన గొప్ప రాజనీతిజ్ఞుడు. జాతిని నిద్ర లేపి పురోగమింపజేయడం నా కల అని జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన నిస్వార్థ రాజకీయ నాయకుడు. సాహితీవేత్తగా కూడా తగినంత గౌరవం లభించాల్సి ఉంది.

● అర్హత గల వ్యక్తుల్లో అగ్రగణ్యులు

- డాక్టర్ నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కరీంనగర్



పురస్కారానికి పీవీ సర్వ విధాల అర్హత గల వ్యక్తుల్లో అగ్రగణ్యుడు. భారతీయులు, తెలుగువారు మరచిపోలేని ఓ అరుదైన, అపూర్వ, మధుర ఘట్టం. కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన ఆయన ఘనత మరింత ఉన్నత శిఖరాలకు చేరింది. రాజనీతిజ్ఞత, భూ, ఆర్థిక సంస్కరణలు, మాతృభాషా విద్యావిధానం వంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఆయన గొప్ప సృజనకారుడు. ఆయన రచనల్లో, అనువాదాల్లో అప్పుడే తెలంగాణ ముద్ర స్పష్టంగా కనిపించేది. గొల్ల రామవ్వ కథే కాకుండా ఆయన రాసిన హాస్య, వ్యంగ్య, రాజకీయ, అధిక్షేప నవల 'మంగయ్యగారి అదృష్టం'.

● పీవీ కుటుంబ సభ్యుడిగా గర్విస్తున్నా

-కేవీ సంతోష్‌బాబు, పీవీ సాహిత్యపీఠం అధ్యక్షుడు, కరీంనగర్



పీవీ తమ్ముడి అల్లుడిగా గర్విస్తున్నా. 2017లో పీవీ సాహిత్యపీఠం నెలకొల్పి ప్రతీ యేటా పురస్కారాలిస్తున్నాం. రచయితలకు కూడా ఎంతో గర్వకారణం.

● ఒక లోటు భర్తీ అయింది...

- వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కరీంనగర్



పీవీ తన జీవితంలో అందుకోని శిఖరాలు లేవు. భారతరత్న పురస్కారంతో ఒక లోటు భర్తీ అయింది. భాషా సాహిత్య పరంగా ఆయన సేవలు అమోఘం. నవీన ఆర్థిక వ్యవస్థలో ఆయన ఒక కొత్త ఒరవడి సృష్టించారు.

● పీవీకి భారతరత్న ఇవ్వడం భేష్..

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు రాజకీయాలకు అతీతంగా దేశానికి చేసిన సేవలను గుర్తించి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం అభినందనీయం. ఈ పురస్కారాన్ని అందించిన మోదీ ప్రభుత్వానికి ధన్యవాదాలు. తెలుగు ప్రజలకు ప్రత్యే కించి తెలంగాణకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. పీవీ నర్సింహారావును కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించింది. బీఆర్ఎస్ కేవలం రాజకీయ లబ్ధికే వాడుకున్నది.

● తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తెలంగాణ ముద్దుబిడ్డ, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం. గతంలోనే బీఆర్ఎస్ పార్టీ పీవీ నర్సింహారావుకు భారత రత్న ప్రకటించాలని డిమాండ్ చేసింది.

● జిల్లా వాసులకు గర్వకారణం..

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించడం హర్షణీయం. జిల్లా వాసులకు గర్వకారణం. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. మోదీ సర్కార్‌కు నగరప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నాం.

పీవీ పేరిట వెలిసిన ఓ గిరిజన గ్రామం

మంథని: చుట్టూ పరుచుకున్న పచ్చటి అడవి.. పక్కనే మానేరు జల తరంగాలు.. లోకం పోకడలు పెద్దగా తెలియని అమాయక గిరిజనులకు ఆవాస కేంద్రం.. వెరసి.. మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ నర్సింహారావు పేరిట ఓ గ్రామం ఆవిర్భవించింది. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని మల్హర్ మండలం కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలో పీవీనగర్‌ను దాదాపు 55 ఏళ్ల క్రితమే గిరిజనులు ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం మల్హర్ మండలం పరిపాలనపరంగా భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతోంది. పెద్దపల్లి-భూపాలపల్లి జిల్లాల సరిహద్దుగా ఉన్న మంథని-మల్హర్ మండలాల్లోని మానేరు నది ఒడ్డున గిరిజనులు పీవీనగర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పీవీ 1971లో మానేరు నదిపై భారీ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నియోజకవర్గంలో తొలి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మంథని పట్టణ శివారులోని బొక్కలవాగుపై సైతం వంతెన నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం సమయంలో తమకు చాలా కాలంపాటు ఉపాధి లభించడంతోపాటు తరుచూ మానేరునది వరదల ముంపుతో సతమతమైన అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన యాకపోడు అనే గిరిజన తెగకు చెందిన ప్రజలు ఆ బాధ లేకుండా ఉండటానికి బ్రిడ్జి అవతలి వైపు అనువుగా ఉన్న స్థలంలో నూతనంగా గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థలం రిజర్వు ఫారెస్టుది కావడంతో అటవీ శాఖ అధికారుల నుంచి ఇబ్బందులు లేకుండా పీవీ చొరవ తీసుకొని గిరిజనులు ఊరిని ఏర్పాటు చేసుకోవడానికి సహకరించారు. దీంతో గిరిజనులంతా ఆయన పేరిట పీవీ నగర్ నామకరణం చేసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో 52 యాకపోడు అనే గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. నాటి నుంచి పీవీ నగర్‌గా మంథని-కాటారం ప్రధాన రహదారి పక్కనే దర్శనిస్తోంది.



పీవీ నగర్ విలేజ్ వ్యూ

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 9: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 13 నుంచి 16 వరకు జరగనున్న జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నగునూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 3,4 తేదీల్లో జిల్లా కేంద్రంలోని సప్తగిరి ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఇద్దరు క్రీడాకారులు డి.శృతి, టి. భానుప్రసాద్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి పతకాలతో తిరిగి రావాలన్నారు. కార్యక్రమంలో కేజీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత కక్షలతోనే హత్య

16 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

కోరుట్ల ఫిబ్రవరి 9 : కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం జరిగిన హత్య కేసును పోలీసులు 16 గంటల్లో ఛేదించారు. హత్యకు పాత కక్షలే కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. కోరుట్ల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంకటరమణ(55)కు కొద్ది రోజులుగా పాత కక్షలు ఉన్నాయి. దీంతో పాటు తన తల్లిపై అసభ్యంగా ప్రచారం చేస్తున్నాడని కొన్ని సార్లు వెంకటరమణతో రఘు గొడవ పడ్డాడు. పెద్దమనుషుల సమక్షంలో ఇదే విషయమై పలుసార్లు పంచాయితీలు జరిగినా వెంకటరమణ ప్రవర్తన మారలేదు. దీంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో రఘుపై తప్పుడు సమాచారం ఇచ్చి కేసు నమోదుకు వెంకటరమణ కారకుడయ్యాడు. అటు తల్లిపై అసభ్యంగా ప్రచారం చేయడంతో పాటు తనపై కేసు పెట్టించడంతో వెంకటరమణపై రఘు పగ పెంచుకుని హత్యకు వ్యూహం రచించాడు. ఈనెల 8వ తేదీన సాయంత్రం వెంకటరమణ కాలనీకి వచ్చి వెలుతున్న సమయంలో అక్కడే మాటు వేసి ఉన్న రఘు తన వెంట తెచ్చుకున్న కత్తితో వెంకటరమణపై దాడి చేసి హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. కాలనీవాసులు, మృతుడి భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు రఘు అర్బన్ కాలనీలోని తన ఇంటి వద్ద ఉన్నాడనే సమాచారంతో ఎస్సై కిరణ్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వాడిన కత్తితో పాటు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుళ్లు విజయ్, సతీష్‌లను సీఐ ప్రవీణ్ కుమార్ అభినందించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

చిన్నారి అపహరణకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 9: సిరిసిల్ల పట్టణంలోని ఓ పాఠశాల వద్ద మూడో తరగతి విద్యార్థినికి చాక్ లెట్ ఆశ చూపి అపహరించేందుకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశమని టౌన్ సీఐ రఘుపతి శుక్రవారం తెలిపారు.

పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఓ పాఠశాల వద్దకు వెళ్లిన ఆగంతకుడు ఎనిమిదేళ్ల బాలికకు చాక్ లెట్ ఇచ్చి అపహరించేందుకు యత్నించాడు. ఆగంతకుడి చేయి కొరికి బాలిక తప్పించుకుంది. అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా పరారయ్యాడు. పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు జాషువా ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని తెలిపారు.

మొలంగూర్ ఖిల్లాను అభివృద్ధి చేయాలి

శంకరపట్నం, ఫిబ్రవరి 9: శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లాను అభివృద్ధి పరచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జక్కని సంజయ్‌కుమార్ కేంద్ర పర్యటక శాఖ కార్యదర్శి వి విద్యావతి, రాకేష్‌కుమార్‌వర్మలకు వినతిపత్రం సమర్పించినట్లు శుక్రవారం తెలిపారు. మొలంగూర్ ఖిల్లా ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు బొంగొని అభిలాష్‌గౌడ్, చంద్రకాంత్ తదితరులు పాల్గన్నారు.

తాళం వేసి ఉన్న మూడిళ్లలో చోరీ

- ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 27 వేల నగదు అపహరణ



పరిశీలిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట, ఫిబ్రవరి 9: తాళం వేసి ఉన్న ఇండ్లే టార్గెట్ చేసి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడుతున్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో మూడిళ్లకు తాళం వేసి ఉండడంతో ఆ ఇళ్లలో చోరీకి పాల్పడి ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 27 వేల నగదును అపహరించారు. గ్రామానికి చెందిన బోనాల నర్సయ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 25 వేల నగదును దోచుకెళ్లారు. కాగా తాళం వేసి ఉన్న గుమ్మడిదారి గౌరవ్వ ఇంట్లో రెండు వేల రూపాయలు నగదు, అలాగే మరో ఇంట్లో కూడా ఇదే విధంగా చోరీకి పాల్పడ్డారు. ఈ ఇంట్లో ఏమి దొరకకపోవడంతో వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై అంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి గ్రామానికి చేరుకొని చోరీకి పాల్పడిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు: తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్ కతాకు చెందిన బాలుడు కిషన్‌కుమార్(12)ను చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా జిల్లా బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యుసీ) ఆధ్వర్యంలో అతని తల్లిదండ్రులకు అప్పగిం చారు. ఈ నెల 3న కరీంనగర్ ఫిష్‌మార్కెట్‌లో కిషన్‌కుమార్(12) అనే బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఒకటో టాణా పోలీసులు గుర్తించి వివరాలు సేకరించారు. సరైన సమాధానం రాకపోవటంతో సీడబ్ల్యుసీ ద్వారా ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్‌లో ఉంచారు. ఓపెన్ షెల్టర్ హోం సిబ్బంది బాలుడి వివరాలను అడగగా తనది పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కత్తా అని చెప్పడంతో వెంటనే సీడబ్ల్యుసీ అధికారులు వివరాలు సేకరించి బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలుడి తల్లిదండ్రులు శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుని వారి కొడుకు ఆధారాలు చూపడంతో వారికి అప్పగించారు. బాలుడు కోల్‌కతాలో 4వ తరగతి వరకు చదివి కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో గొడవల కారణంగా చదువు మానేశాడు. ఫిబ్రవరిలో తన అమ్మమ్మతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న దగ్గరి బంధువుల వద్దకు రైల్‌లో వస్తుండగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయాడు. తప్పిపోయిన బాలుడు చివరకు కరీంనగర్‌కు చేరుకున్నాడు. బాలుడు తెలిపిన వివరాలతో బాలల సంక్షేమ సమితి అధికారులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యుసీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, అర్చన, రాధ, విజయ్, చైల్డ్‌హెల్ప్ లైన్ 1098కు చెందిన సాయికిరణ్, ప్రియాంక, స్వప్న పాల్గొన్నారు.

రాజన్నపేటలో శిలాఫలకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించిన ప్రగతి ప్రాంగణం శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, సురేందర్ తదితరులు ఉన్నారు.

● కేసు నమోదు..

రాజన్నపేటలోని ప్రగతి ప్రాంగణం శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులోని ప్రగతి ప్రాంగణం శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో రూ.20వేల నష్టం వాటిల్లిందని పేర్కొంటూ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న గోసికంటి రవి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

నేడే నవోదయ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

చొప్పదండి, ఫిబ్రవరి 9: నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీచేసేందుకు శనివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మంగతాయరు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,745 మంది విద్యార్థులు 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1144 మంది విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరి కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు.

రాజన్న ఆలయంలో దొంగ చేతివాటం

- చితకబాదిన భక్తులు



యాత్రికులకు నగదు తిరిగి అందజేస్తున్న ఆలయ భద్రతా సిబ్బంది

వేములవాడ, ఫిబ్రవరి 9: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును దొంగిలించడానికి యత్నించిన ఓ వ్యక్తిని భక్తులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయ క్యూలైన్లో ఒక భక్తురాలి మెడలోంచి పుస్తెలతాడును అపహరించేందుకు యత్నించగా గుర్తించిన భక్తులు సదరు వ్యక్తిని పట్టుకుని చితకబాది ఆలయ భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా సదరు దొంగను విచారించిన క్రమంలో అంతకుముందు సదరు దొంగ మరో యాత్రికుడి వద్దనుంచి 5,000 రూపాయలను దొంగిలించినట్లు గుర్తించారు. 5,000 రూపాయలను భూపాల్‌పల్లి మండలానికి చెందిన సంతోష్ అనే భక్తుడి వద్ద దొంగలించినట్లు గుర్తించి ఆ సొమ్మును ఆలయ భద్రతా సిబ్బంది అతనికి తిరిగి అందజేశారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి కరీంనగర్ సమీపంలోని చింతకుంటగా గుర్తించామన్నారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించామని ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

శంకరపట్నం, ఫిబ్రవరి 9: మండలంలోని మొలంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శివకుమారి అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇల్లు పర్మిషన్ ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి మమత వేధిస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీవాణిని వివరణ కోరగా ఇంటి నిర్మాణానికి సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేనందున పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



రాంచందర్ (ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 9: మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామాని కి చెందిన కొర్వి రాంచందర్(36) అనే యువకుడు పెళ్లికావడం లేదనే మనస్తాపంతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్వి రాంచందర్ తనకు సరైన జీవనోపాధి లేకపోవడంతో పెళ్లి చేసుకోలేదు. సంవత్సరం క్రితం కరీంనగర్ ఫ్యామిలీ కోర్టులో అటెండర్‌గా ఉద్యోగం రావడంతో విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగం చేస్తున్నా తనకు పెళ్లి కుదరడం లేదని రెండు నెలలుగా విధులకు వెళ్లకుండా మనస్తాపానికి గురై గురువారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకు తరచూ పెళ్లికావడం లేదని బాధపడుతుండే వాడని దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి కొర్వి సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ..

శంకరపట్నం, ఫిబ్రవరి 9: మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన మహ్మద్‌గౌస్ (32) అనే యువకుడు గురువారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లికి చెందిన గౌస్ శంకరపట్నం మండలం కరీంపేటకు చెందిన కరిష్మాను వివాహం చేసుకొని కరీంపేటలోనే కూలీ పనులు చేసుకుంటూ భార్యా పిల్లలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి తాగుడుకు బానిసై కూలీ డబ్బులు తాగుడికే ఖర్చు చేసేవాడు. కుటుంబ బాధ్యతలు పట్టించుకునే వాడు కాదు. గురువారం మృతుడు గౌస్ తన భార్యతో అమ్మమ్మ, తాత దగ్గరికి వెళ్తున్నానని చెప్పి కరీంపేట గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కరిష్మా, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. మృతుడి భార్య కరిష్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామంలోని యువకులు చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో ఇటీవల నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం ఖాళీ స్థలంలో గొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజు టీ కొట్టు నడుపుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. టీ కొట్టు చుట్టు రేకులు అమర్చుకోవడం కోసం బండ రాళ్లు పేర్చుతుండగా మండల కేంద్రానికి చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి, సందుపట్ల పద్మారెడ్డి, మోగి ఆగయ్య ఖాళీ స్థలం తమదని పేర్కొంటూ ఇటీవల కులం పేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఘటన స్థలంలో ఇరువర్గాలను విచారించారు. వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. నిజనిర్ధారణ చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ ఉన్నారు.

రేపు గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 9: హైదరాబాద్‌కు చెందిన విష్ణు ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11న గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను తెలియజేశారు. స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు తెలంగాణ గ్రూపు-1 ఆఫీసర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నూతనకంటి వెంకట్, విన్నర్ పబ్లికేషన్ డైరెక్టర్ ప్రసన్న హరికృష్ణ, విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విష్ణువర్ధన్, జిల్లా ట్రెజరీ అధికారి ఎన్ నవీన్‌కుమార్ పాల్గొని పరీక్షల తీరు ప్రక్రియను పూర్తిస్థాయిలో వివరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 9: ఎస్‌యూ పరిధిలోని డిగ్రీ డిజైన్ టెక్నాలజీ, హానర్స్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను www.Satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

పాం ఆయిల్, వరి పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ ఆధికారి భాస్కర్

రుద్రంగి, ఫిబ్రవరి 9: రుద్రంగి మండలంలోని పాంఆయిల్, వరి పంటలను జిల్లా వ్యవసాయ ఆధికారి భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కాండం తొలిచే పురుగును గమనించినట్లు చెప్పారు. ముందుస్తు చర్యల్లో భాగంగా వరి నారు వేయడానికి ముందు కార్బొఫురిన్ 3జీ గుళికలను ఎకరానికి సరిపడా నారుమడిలో వేసుకోవాలన్నారు. ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, వరికి బదులు ఆయిల్ పాం సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యసాయ ఆధికారి దుర్గరావు, ఏఈవో విజయ్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి తనిఖీ చేసిన అధికారులు



తనిఖీలో పాల్గొన్న అధికారులతో వైద్యులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9 : జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని బ్లడ్ సెంటర్, ఆస్పత్రిని సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్, జిల్లా ఇన్‌స్పెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. బ్లడ్ కంపోనెంట్ సౌకర్యం కల్పించడంలో భాగంగా అఫెరిసిస్ పరికరం కాంపోనెంట్ సపరేటర్లను ఏర్పాటు చేయగా వాటిని పరిశీలించారు. సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంగ్రం ఉరుమడ్ల, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ భవాని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో పీఆర్‌పీ, ఎస్‌డీపీ, ఎఫ్‌ఎఫ్, పీఆర్‌బీసీ, వోల్ బ్లడ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు అనుమతులు ఇస్తామన్నారన్నారు. జిల్లా ప్రధాన వైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఆస్పత్రి సూరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ సంతోష్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, బ్లడ్‌సెంటర్ అధికారులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్య పరిచిన డాక్టర్ జయగోపాల్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాస్తికోద్యమ నాయకుడు డాక్టర్ జయగోపాల్ ప్రజలను చైతన్య పరచడానికి ఎంతో కృషి చేశారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామరాజు అన్నారు. డాక్టర్ జయగోపాల్ మరణించడంతో శుక్రవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ జయగోపాల్ మరణం తీరని లోటన్నారు. దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, జనవిజ్ఞాన వేదిక నాయకుడు తౌటు మధుసూదన్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు నాంపెల్లి, టీజేఏసీ నాయకుడు రవి, డీఎల్‌ఎఫ్ నాయకుడు రామస్వామి, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు పరీక్షలు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 9:టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించి డ్రాయింగ్‌లో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రమేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. టైలరింగ్, ఎం బ్రాయిడరీ, లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కుట్టుమిషన్‌లను వెంట తీసుకొని గంట ముందు పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు.

కాంగ్రెస్ ఫిషర్ మన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ఫిషర్ మన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ప్రశాంత్‌ను నియమించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రశాంత్‌కు సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అందజేశారు.కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, జిల్లా నాయకులు వైద్య శివప్రసాద్, పూర్మాణి లింగారెడ్డి, సేవదల్ జిల్లా అధ్యక్షుడు మోర రాజు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రాజు, సిరిసిల్ల నియోజకవర్గం అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధూకర్, జిల్లా హ్యూమన్‌రైట్స్ యూత్ అధ్యక్షుడు భరత్, కాంగ్రెస్ తంగళ్లపల్లి మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, తంగళ్లపల్లి గ్రామ అధ్యక్షుడు నర్సింగం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ అర్హుల గుర్తింపు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హుల గుర్తింపునకు చర్యలు చేపట్టింది. ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శి దేవరాజు అర్హుల వివరాలను శుక్రవారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రజలు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ సిలిండర్ ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేయించుకునేందుకు బారులుదీరారు.

వంతెన నిర్మాణంలో వేగం పెంచాలి

వీర్నపల్లి, ఫిబ్రవరి 9: వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, పనులు సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్య ప్రకాష్ అన్నారు. వీర్నపల్లి మండలం అడవిపదిరలో చేపట్టిన వంతెన నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వంతెన నిర్మాణంతో రాకపోకలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. డీఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎడ్ల సాగర్, కాంట్రాక్టర్ నారాయణరెడ్డి, ఏఈ వెంకన్న, నాయకులు భాస్కర్ ఉన్నారు.

18న ఉపాధిహామీ కార్మికుల సదస్సు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 9: ఉపాధి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 18న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉపాధిహామీ కార్మికుల సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మిక చట్టానికి తూట్లు పొడుస్తూ కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. 15 రోజులకు చెల్లించాల్సిన కూలి డబ్బులను నెలల తరబడి చెల్లించడం లేదన్నారు. జిల్లాలో ఉపాధిహామీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, ఉపాధిహామీ కార్మికులు హాజరుకావాలని కోరారు.

నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల పుస్తకాల అందజేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన స్నేహితుడు సిరిసిల్ల పట్టణంలోని ప్రసన్న హరికృష్ణ ద్వారా సమకూర్చిన రూ.40 వేల విలువైన పోటీ పరీక్ష పుస్తకాలను మాజీ సర్పంచ్ దేవానందం శుక్రవారం నిరుద్యోగులకు అందజేశారు. ఎమ్మెల్యే సత్యం, ప్రసన్నహరికృష్ణ, మాజీ సర్పంచ్ దేవానందంకు యువత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శ్రావణ్, సుమన్, లహరి, ఉస్మాన్, సబిత, అశ్విని, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న యువతిని పట్టుకున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9:మండలంలోని పెద్దలింగాపూర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువతిని గ్రామస్థులు శుక్రవారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రెండు రోజులుగా మండలంలో పిల్లలను ఎత్తుకపోతున్నారనే వదంతులు వ్యాపించడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో శుక్రవారం ఓ యువతి అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గమనించి పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు యువతిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారించగా భిక్షాటన చేసే యువతిగా గుర్తించారు. తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఎస్సై సుధాకర్ తెలిపారు.

గంభీరావుపేటలో అంజన్న జాతర

గంభీరావుపేట, ఫిబ్రవరి 9 : గంభీరావుపేట మండల కేంద్రంలోని లింగన్నపేట వెళ్లే దారిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మాఘ అమవాస్య జాతర శుక్రవారం కొనసాగింది. ఏటా మాఘ అమవాస్య రోజున అంజన్నస్వామి ఆలయం వద్ద జాతర నిర్వహిస్తారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం మల్లారెడ్డిపేట, గంభీరావుపేట ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

● గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో మాఘ అమావ్యాస జాతర శుక్రవారం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద జాతర కొనసాగింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా మాఘ అమావాస్య వేడుకలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: మాఘ అమావాస్య వేడుకలు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. అక్కపల్లి శివారులోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, సిరిసిల్ల, ముస్తాబాద్, సిరికొండ, తదితర మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. రామలింగేశ్వర స్వామి, హనుమాన్, మల్లన్న ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీ కేశవ పెరుమాండ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు అభిషేకం, తదితర పూజలను నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకలను ఘనంగా జరిపించారు. గొల్లపల్లిలోని గాలం గుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కోరుట్లపేట, వెంకటాపూర్‌లోని గంగమ్మ, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్రముఖ వైద్యుడు సత్యనారాయణస్వామి, సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రమాకాంత్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ప్రత్యేక అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, శ్రీనివాస్, గీతాంజలి, మధు, పద్మ, మల్లేశం, తిరుపతిబాబు, బాబు, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, మధుకర్, దేవానందం, బాల్‌రెడ్డి, సరోజన, అంజవ్వ, ప్రత్యేక అధికారులు రాంచందర్, చిరంజీవి, నాయకులు రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లింగాగౌడ్, పర్శరాములు, సుభాష్, నర్సింహారెడ్డి, కిషన్, సురేందర్‌రెడ్డి, పద్మారెడ్డి, దేవరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నర్సయ్య, సంజీవరెడ్డి, నారాయణ, భాస్కర్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవరెడ్డి, రాజు, లచ్చిరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్: వేములవాడ మండలంలోని కొడుముంజలో రామప్ప రామలింగేశ్వరస్వామి జాతరలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. గ్రామస్థులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వేములవాడ రూరల్: మండలంలోని నాగాయపల్లి దుబ్బరాజేశ్వరస్వామి ఆలయంలో శివకల్యాణం, రథోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో తీర్థప్రసాదాలు వితరణ చేపట్టారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎంపీపీ బండ మల్లేశం, చందుర్తి జడ్పీటీసీ నాగంకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు సోయినేని కరుణాకర్, సంఘస్వామి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

చందుర్తి: చందుర్తి మండలం జోగాపూర్, మల్యాల గ్రామాల్లోని సీతారామచంద్రస్వామి ఆలయాల్లో శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఏటా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాములవారి జాతరకు మండలంలోని వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జడ్పీటీసీ నాగం కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మ్యాకల గణేష్, నాయకులు నాగం రాజ మల్లయ్య, ధర్మపురి శ్రీనివాస్,మ్యాకల పర్శరాములు, రామాలయ ఆలయ కమిటీ చైర్మన్ బిల్లా వెంకట్ రాములు, గజవాడ రాము, నాగం గణేష్, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జడ్పీటీసీ నాగం కుమార్



స్వామివారిని దర్శించుకున్న మనోహర్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం



రామప్ప రామలింగేశ్వరస్వామి కల్యాణంలో దంపతులు

పెద్దూర్ రైతుల కోసం భూముల సర్వే

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 9: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో మెడికల్ కళాశాల భవనాలను నిర్మిస్తున్న భూములకు చెందిన రైతులకు మరోచోట భూములను ఇచ్చేందుకు శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే చేయించారు. సర్వే నంబరు 408లో ఉన్న ప్రభుత్వ భూములను గత ప్రభుత్వాలు నిరుపేదలకు అందించాయి. ఆ భూముల నుంచి మెడికల్ కళాశాల కోసం 36 ఎకరాలను రెవెన్యూ అధికారులు మెడికల్ కళాశాలకు కేటాయించారు. అందులో మెడికల్ కళాశాల భవనాన్ని నిర్మించారు. అభూములకు సంబంధించిన రైతులు ఆందోళన చేయగా మరోచోట భూములను ఇవ్వడంతోపాటు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు. మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న రైతులు నష్టపరిహారంతోపాటు భూమికి బదులు భూమిని ఇప్పించాలంటూ ఆందోళన చేపట్టారు. పనులను అడ్డుకోవడంతో స్పందించిన కలెక్టర్ అనురాగ్‌జయంతి రైతుల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం రాత్రి సిరిసిల్ల ఆర్డీవో రైతులతో చర్చలు జరిపి పెద్దూర్ శివారులో మరోచోట కమర్షియల్‌కు భూమిని అందిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం జిల్లా సర్వేయర్ శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ రైతులు చూపించిన భూములను సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్, లింగంపల్లి అశోక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సర్వేయర్‌లు

పీవీకి భారతరత్న పురస్కారం హర్షణీయం



సిరిసిల్లలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం హర్షణీయమని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట శుక్రవారం పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో పనిచేసిన పీవీ నరసింహారావు సేవలను ఆ పార్టీ గుర్తించలేదని, బీజేపీ ప్రభుత్వంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తించి పురస్కారాన్ని ప్రకటించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, పోతు శ్రీనివాస్, చొప్పదండి అంజన్న, జంప రాజు, రామకృష్ణ, మోర శ్రీహరి, ఇంజపురి మురళి, చొప్పదండి శ్రీనివాస్, కోడం అనంద్‌బాబు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న తెలంగాణకే గర్వకారణం

ఎల్లారెడ్డిపేట: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం తెలంగాణకే గర్వకారణమని పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా వంగరలో జన్మించిన పీవీ నర్సింహారావు పదవులు చేపట్టి తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహనీయుడని కొనియాడారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 9: విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, పీఆర్‌సీని వీలైనంత త్వరగా అమలు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ఆ సంఘం స్థలంలో శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులు మచ్చ ఆనంద్, నల్ల సత్యనారాయణ, బత్తుల మధుసూదన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని, కేజీబీవీల్లో పని చేస్తున్న సిబ్బందికి మినిమమ్ టైంస్కేల్‌ను వర్తింపజేయాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, నీలి శ్రీనివాస్, మూడి శెట్టి మహేష్, చిప్ప యాదగిరి, మాన్వాడ శంకర్, బోనాల మల్లారెడ్డి, గుర్రం దేవదాస్, గుర్రం మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, పోలుక ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాదవేణి మంజుల డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని కుటుంబాలను పోషించుకుంటున్న ఆశావర్కర్లకు డిసెంబర్, జనవరి వేతనాలను ప్రభుత్వం అందించలేదని, ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. 18 సంవత్సరాల నుంచి పని చేస్తున్న ఆశా వర్కర్లు బడుగు బలహీనవర్గాలకు చెందిన మహిళలని, గత ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా ఆశావర్కర్ల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆశాలతో అదనపు పనులు చేయించవద్దని, నెలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనాలు అమలు చేయా లని అన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రసూతి సెలవులపై ఉత్తర్వులు జారీ చేయాలని, పదవీవిరమణ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లాప్రధాన కార్యదర్శి గుమ్మడి జయశీల, లత, చంద్రకళ, మమత, లావణ్య, భాగ్యలక్ష్మీ, రుచిత, రేణుక, సీఐటీయూ నాయకులు ఒగ్గు గణేష్, గడ్డం రాజశేఖర్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా

ఆశా వర్కర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తానని, పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ధర్నా చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను తెలుసుకున్నారు. దీంతో సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు ఇప్పించాలని ఆశాలు ఆయనకు వివరించారు.



ఆశావర్కర్లతో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

మోడల్ లే అవుట్ సిద్ధం చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 9: వేములవాడ నియోజకవర్గంలోని తిప్పాపూర్, మారుపాక గ్రామాల్లో 32 ఎకరాల్లో మోడల్ లే అవుట్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం వేములవాడ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌లతో చేపట్టిన సమావేశంలో మాట్లాడారు. ఈ రెండు గ్రామాల్లో 32 ఎకరాల్లో మోడల్ లే అవుట్‌లలో పూర్తి స్థాయిలో రోడ్డు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. లే అవుట్ స్థలానికి చెందిన మ్యాపులను కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్ పాల్గొన్నారు.

రేపు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

వేములవాడ, ఫిబ్రవరి 9: వేములవాడ పట్టణంలోని బోయినిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రకాశ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగనున్న ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు ఏదేని గుర్తింపుకార్డును వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. కనీసం గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా టీఆర్‌ఈఐఎస్, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ టీటీడబ్ల్యూఆర్‌ఎస్, ఎంజేబీటీసీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలల్లో ప్రవేశం లభిస్తుందని వివరించారు.

కొబ్బరి ముక్కల టెండర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 9: వేములవాడ మండలం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయంలోని కొబ్బరి ముక్కల సేకరణ చేసుకునే టెండర్‌ను ఉత్సాహం ఉన్న టెండర్‌దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ఈవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్‌లో పాల్గొనే వారు డిపాజిట్ రూ.లక్ష డిపాజిట్ చేయాలని, ఫిబ్రవరి 13న మధ్యాహ్నం ఒంటి గంటకు దేవాలయం ఆవరణలో టెండర్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెండర్ కాలం 2024 ఏప్రిల్ 15వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 14వ వరకు కొనసాగుతుందని తెలిపారు.

పాఠశాల తనిఖీ

రుద్రంగి, ఫిబ్రవరి, 9: రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ శ్రీలత శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, పదవ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో వనిత తదిరతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

చందుర్తి, ఫిబ్రవరి 9 : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ప్రత్యేక అధికారి (డీఎఫ్‌వో) శివప్రసాద్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలోని రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట వసతి గృహ సంక్షేమ అధికారి రవీంద్ర స్వామి ఉన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల తొలగింపు

బోయినపల్లి, ఫిబ్రవరి 9: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బోయినపల్లి మండలం తడగొండ అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఆయా లక్ష్మిని తొలగించినట్లు సీడీపీవో ఎల్లయ్యమ తెలిపారు. వీరిద్దరిపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు పేరొన్నారు.

జాతీయ సైన్స్ సంబరాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో జాతీయ సైన్స్ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి, జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. పెయింటింగ్‌లో వర్షిని, కవిత్వంలో రేష్మ, పాటలపోటీలో వీణ, ఉపన్యాస పోటీలలో రక్షిత విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, బయోసైన్స్ టీచర్లు మహేష్‌చంద్ర, యాద రవి పాల్గొన్నారు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 9: సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ ఆర్టీఏ ఆఫీస్ సమీపంలో మామిడాల కృష్ణ ఇల్లు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దగ్ధమైంది. ఇంట్లో దేవుడికి దీపం వెలిగించి జాతరకు వెళ్లి వచ్చే సరికి నిప్పు అంటుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలు ఆర్పేశారు. ఇంట్లోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 9: పదవీకాలం పూర్తయిన సందర్భంగా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భైరి శ్రీవాణి రమేష్, ఉప సర్పంచ్ అలువాల సాయి, వార్డు సభ్యులను, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 9: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. వేములవాడ మండలం చింతలఠాణా గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రసాద్‌కు వైద్య ఖర్చులు నిమిత్తం యువ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుడిసెల రాజశేఖర్ టీం సభ్యులతో కలిసి అందజేశారు. యువ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ ప్రశాంత్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కోనరావుపేట, ఫిబ్రవరి 9: కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కాసర్ల శ్రీనివాస్ మృతి చెందగా పేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో తక్షణ సహాయం కింద 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కాంగ్రెస్ నాయకులు సత్యం వెంకటేశం, నరేష్, మహేష్, తిరుపతి, ప్రశాంత్, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.